VC NEWS
# వేగుచుక్క
పీడిత ప్రజల గొంతుక...
TELUGU DAILY NEWS
www.veguchukkanews.com
ఆదివారం 24 మార్చి 2024
సంపుటి.01 సంచిక.225

## 9 -12 సీట్లలో గెలుపు మనదే

**ఫాంహౌస్‌లో కేటీఆర్, హరీశ్‌తో భేటీలో కేసీఆర్**

**లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం**



హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో 9 నుంచి 12 స్థానాల్లో బీఆర్ఎస్ గెలుస్తుందని పార్టీ అధినేత కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. ఇందుకోసం వ్యూహాత్మకంగా ముందుకు సాగాలని ఆయన స్పష్టం చేశారు. శనివారం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో కేసీఆర్‌తో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సమావేశమై కవిత అరెస్టు, ఢిల్లీ పరిణామాలను వివరించారు. దీంతో పార్టీపరంగా చేయాల్సిన న్యాయ, రాజకీయ పోరాటంపై కేసీఆర్ వారికి దిశానిర్దేశం చేశారు. అనంతరం రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్, బీజేపీ ఎత్తుగడలపై చర్చించారు.పోటీ చేసే పార్టీ అభ్యర్థుల ఎంపిక పూర్తయినందున అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. బీఆర్ఎస్ లక్ష్యంగా కాంగ్రెస్, బీజేపీ అమలు చేస్తున్న ఎత్తుగడలను విశ్లేషించారు.

# విచారణకు సహకరించని ఎమ్మెల్సీ కవిత

- రౌస్ అవెన్యూ కోర్టుకు వివరించిన ఇడి
- కవితకు మరో మూడ్రోజుల కస్టడీ పొడిగింపు
- కస్టడీ ముగియడంతో కోర్టులో హాజరుపర్చిన ఇడి
- ఐదు రోజుల కస్టడీ కోరగా మూడ్రోజులకు అనుమతి
- ఆమె ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుంటున్నామన్న అధికారులు



కోర్టులోకి వెళ్లే ముందు ఆమె మీడియాతో మాట్లాడారు. తన అరెస్టు అక్రమమని.. న్యాయపోరాటం చేస్తానని పేర్కొన్నారు. మరోవైపు సీబీఐ కోర్టులో బెయిల్ పిటిషన్‌ను కవిత తరపు న్యాయవాది దాఖలు చేశారు. వెంటనే ఈడీకి నోటీసులు ఇవ్వాలని కోరారు.

2 లో




## హైకోర్టును ఆశ్రయించిన కేజ్రీవాల్

**న్యూఢిల్లీ:** ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టై.. ఈడీ కస్టడీలో ఉన్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ శనివారం హైకోర్టును ఆశ్రయించారు. ఢిల్లీ మద్యం పాలసీ కుంభకోణంలో మనీలాండరింగ్ కేసులో అరెస్ట్ చేసి రిమాండ్ చేయడాన్ని సీఎం కేజ్రివాల్ సవాల్ చేస్తూ.. ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మార్చి 24 ఆదివారంలోపు తను దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యవసరంగా విచారించాలని పిటిషన్‌లో కోరారు. అత్యవసర విచారణ కోసం కేజ్రివాల్ తరపు అడ్వకేట్ ప్రయత్నం చేస్తున్నారు. ఇక.. గురువారం ఈడీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసింది. నిన్న శుక్రవారం అరవింద్ కేజ్రీవాల్‌ను కోర్టుకు హాజరుపరిచి.. ఈడీ పదిరోజుల కస్టడీకి కోరింది.
దీంతో కోర్టు ఆరు రోజుల పాటు కేజ్రీవాల్‌ను ఈడీ కస్టడీకి అప్పగించిన విషయం తెలిసిందే. తాజాగా ఈడీ రిమాండ్‌ను కేజ్రీవాల్ హైకోర్టులో సవాల్ చేశారు.

## ఎన్నికల వ్యూహాలపై... నేడు బీజేపీ కీలక భేటీలు



హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో... ఆది వారం బీజేపీకి సంబంధించి రెండు ము ఖ్యమైన సమావేశా లు జరగనున్నాయి. ఈ భేటీల్లో పార్టీ పరంగా ఎన్నికల వ్యూహాల ఖరారుతో పాటు, ప్రచార వ్యూహం, లేవనెత్తా ల్సిన అంశాలు, లోక్ సభ నియోజక వర్గాల్లో ఎన్నికల ప్రచారం తదితర అంశాలు చర్చకు రానున్నాయి. పార్టీ కార్యాలయంలో కేంద్ర మంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అధ్యక్షతన ఉదయం 11 గంటలకు జరగనున్న భేటీలో... పార్లమెంట్ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు, పార్లమెంట్ ఇన్‌చార్జిలు, జిల్లా అధ్యక్షులు, రాష్ట్ర నాయకులతో సమావేశం కానున్నారు.మధ్యాహ్నం విడిగా రాష్ట్రపార్టీ ముఖ్యనేతల సమావేశం కూడా జరగనుంది. ఈ సమావేశాలకు పార్టీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు, ఎంపీ డా.కె.లక్ష్మణ్, జాతీయ ఉపా ధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శులు, రాష్ట్రపార్టీ ఇన్‌చార్జిలు సునీల్ బన్సల్, తరుణ్ ఛుగ్ ఇతర నాయ కులు పాల్గొంటారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కార్యక్రమాలను రూపొందించడం, కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను ఎండగట్టడంతోపాటు హామీలను నెరవేర్చే విధంగా ఒత్తిడి పెంచేలా కార్యాచరణ ఖరారు చేస్తామని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు

### పోలీసుల అదుపులో ఏఎస్పీ భుజంగరావు



హైదరాబాద్: తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసులో తాజాగా మరో కీలక మలుపు చోటు చేసుకుంది. భూపాలపల్లి అదనపు ఎస్పీ భుజంగరావుని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ప్రణీత్ రావుతో కలిసి భుజంగరావు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. భూపాలపల్లి ఏఎస్పీగా ఉన్న భుజంగరావు.. గతంలో తెలంగాణ ఇంటెలిజెన్స్‌లో పనిచేశారు. రేపు ఆయన్ను న్యాయమూర్తి ఎదుట పోలీసులు హాజరు పర్చునున్నారు. ప్రణీత్ రావును, భుజంగరావును శనివారం పోలీసులు ఎనిమిది గంటలపాటు విచారించారు. అనంతరం బంజారాహిల్స్ పోలీస్ పోలీసులు.. భుజంగరావు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో ప్రధాన నిందితుడైన ప్రణీత్రావును ఇప్పటికే ఆరు రోజుల పాటు పోలీసులు విచారించారు. రేపు( ఆదివారం) మెజిస్ట్రేట్ ఇంట్లో హాజరుపరిచే అవకాశం ఉ?న్నట్లు తెలుస్తోంది. ప్రణీత్‌రావు ఇచ్చిన సమాచారం ఆధారంగా.. ఎస్ఐబీలో పని చేసిన పలువురు అధికారులు, కానిస్టేబుల్స్‌ను పిలిచి విచారించారు.మరోవైపు ఎస్ఐబీలో పని చేసిన అడిషనల్ ఎస్పీ తిరుపతన్నకు నోటీసులు ఇచ్చారు. దీంతో ఆయన బంజారాహిల్స్ పోలీసు స్టేషన్‌లో స్పెషల్ టీమ్ ముందు హాజరయ్యారు. వీరితో పాటు గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎస్ఐబీలో పని చేసిన వాళ్లందరినీ విచారించే అవకాశం ఉ?న్నట్లు తెలుస్తోంది.

## మరో ముగ్గురు అభ్యర్థులను ప్రకటించిన కెసిఆర్



2 లో

- హైదరాబాద్ మినహా 16 స్థానాలకు అభ్యర్థుల ఖరారు
- సికింద్రాబాద్‌కు పద్మారావు..భువనగిరికి క్యామ మల్లేశం
- నల్లగొండ నుంచి కంచర్ల కృష్ణారెడ్డి పేరు ప్రకటన

## కత్తులు నూరుతున్న పార్టీలు

- పరస్పర విమర్శలతో వేడెక్కిన తెలంగాణ
- రేవంత్ పాలనాతీరుపై ప్రజల్లో భరోసా


2 లో



# భగత్ సింగ్ ఆశయాలను కొనసాగించాలి.

## - "సత్యశోధక్" ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య.

వేగుచుక్క న్యూస్, సిరికొండ, మార్చి 23



స్వేచ్ఛ భారతం కోసం చిరు ప్రాయంలోనే ప్రాణాలను తృణ ప్రాయంగా త్యాగం చేసిన విప్లవ యువకిశోరాలు షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల ఆశయాలను యువత కొనసాగించాలని సత్యశోధక్ పాఠశాల ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య అన్నారు. స్వాతంత్రోద్యమంలో భారతదేశ దాస్య విముక్తి పోరాటంలో బ్రిటిష్ వారి గుండెల్లో సింహ స్వప్నలైన వీర యోధులు షాహిద్ భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల 93వ వర్ధంతి, షాహిద్ దివాస్ ను శనివారం సత్యశోధక్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. అమరులైన భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్ ల చిత్రపటాలకు ప్రిన్సిపాల్ ఆర్. నర్సయ్య పూలమాలలను వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ నర్సయ్య మాట్లాడుతూ, నూనుగు మీసాల వయసులోనే స్వతంత్ర పోరాటంలో పాల్గొని తెల్లదొరల ఆగడాలను, అరాచకాలను అడ్డుకొని యావత్ భారతీయులలో చైతన్యం నింపి, ఉరికంబాన్ని చిరునవ్వులతో ముద్దాడిన ఆ ముగ్గురు స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చిరస్మరణీయులన్నారు. ఉద్యమ స్ఫూర్తిని నరనరాన రంగరించుకొని భారతీయులలో స్వరాజ్య కాంక్షను రేకెత్తించి దేశభక్తిని రంగరించుకొని చేసిన పోరాట పటిమ, చూపిన తెగువ నేటి యువతకు మార్గదర్శకం కావాలన్నారు. మహానీయులు ఆశయాల సాధనకు, సమ సమాజ స్థాపన ప్రతిఒక్కరం కృషి చేయడమే అమరవీరులకు నిజమైన నివాళి అర్పించడమని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొననైనది.

# మరో ముగ్గురు అభ్యర్థులున ప్రకటించిన కెసిఆర్

**హైదరాబాద్:** లోక్‌సభ ఎన్నికలకు బిఆర్ఎస్ అభ్యర్థుల ఎంపిక పూర్తయ్యింది. హైదరాబాద్ మినహా అన్ని స్థానాలను ప్రకటించారు. దీంతో 16 స్థానాలకు అభ్యర్థుల ఖరారు పూర్తయ్యింది. తాజాగా ముగ్గురు అభ్యర్థులను కెసిఆర్ ప్రకటించారు. తొలుత సికింద్రాబాద్‌కు పద్మారావును తరవాత
ఇద్దరు అభ్యర్థులను భారాస ప్రకటించింది. భువనగిరి నుంచి క్యామ మల్లేశ్, నల్గొండ నుంచి కంచర్ల కృష్ణారెడ్డి పోటీ చేస్తారని అధినేత కేసీఆర్ ప్రకటించారు. ఇప్పటి వరకు హైదరాబాద్ మినహా అన్ని లోక్‌సభ స్థానాలకు భారాస అభ్యర్థులను ప్రకటించింది. అంతకుముందు సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానానికి బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిని ఖరారు చేసింది. పార్టీ సీనియర్ నేత పద్మారావు గౌడ్‌ను బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖరరావు ఎంపి అభ్యర్థిగా ఎంపిక చేశారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం ఆయన పార్లమెంట్ నియోజకవర్గ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా నాయకులు అభిప్రాయం మేరకు సికింద్రాబాద్ అభ్యర్థిగా పద్మారావు పేరును ఖరారు చేశారు. ఇప్పటి వరకు 14 స్థానాలకు బీఆర్ఎస్ అభ్యర్థులను ప్రకటించింది. భువనగిరి, నల్గొండ, హైదరాబాద్ పార్లమెంట్ స్థానాలకు ఇంకా అభ్యర్థులను ప్రకటించాల్సి ఉన్నది. మొన్నటి ఎన్నికల్లో పద్మారావు గౌడ్ ఎమ్మెల్యేగా గెలిచారు. గతంలో డిప్యూటి స్పీకర్‌గా కూడ ఆపనిచేశారు. వివాద రహితుడిగా పేరుంది. తలసాని కుటుంబం నుంచి ఎవరు కూడా ముందుకు రాకపోవడంతో పద్మారావును ఎంపిక చేయాల్సి వచ్చింది. ఇకపోతే ఇప్పటికే నాగర్‌కర్నూల్ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మెదక్ నుంచి వెంకట్రామిరెడ్డి, మహబూబ్‌నగర్ నుంచి మన్నె శ్రీనివాస్ రెడ్డి, కరీంనగర్ నుంచి వినోద్ కుమార్, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్, జహీరాబాద్ నుంచి గాలి అనిల్ కుమార్, ఖమ్మం నుంచి నామా నాగేశ్వర్ రావు, చేవెళ్ల నుంచి కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మహబూబాబాద్ నుంచి మాలోత్ కవిత, మల్కాజ్‌గిరి నుంచి రాగిడి లక్ష్మారెడ్డి, ఆదిలాబాద్ నుంచి ఆత్రం సక్కు, నిజామాబాద్ నుంచి బాజిరెడ్డి గోవర్ధన్, వరంగల్ నుంచి కడియం కావ్య పోటీ చేయనున్నారు. పలువురు ఎంపిలు ఇప్పటికే పార్టీలు మారారు. దీంతో బిఆర్ఎస్ నుంచి పోటీ చేయడానికి ఎవరు కూడా ముందుకు రాలేదు.

# విచారణకు సహకరించని ఎమ్మెల్సీ కవిత

**న్యూఢిల్లీ:** ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అరెస్ట్ అయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కస్టడీని కోర్టు మరో మూడ్రోజులు పొడదగించింది. అలాగే ఆమెకు మెడికల్ చెకప్ చేయిస్తున్నామని ఇడి కోర్టుకు వివరించింది. కస్టడీ ముగియడంతో శనివారం కోర్టులో కవితను మాజరు పర్చిన ఇడి, మరో ఐదు రోజుల కస్టడీ కోరింది. అయితే కోర్టు కేవలం మూడ్రోజులు మాత్రమే అనుమతించింది. అంతకుముందు తమ విచారణకు కవిత సహకరించడం లేదని ఈడీ ఆరోపించింది. సమీర్ మహీంద్రతో కలిపి కవితను ప్రశ్నించాలని తెలిపింది. లిక్కర్ స్కామ్ లో రూ.కోట్లలో కిక్ బ్యాక్‌లు అందాయని ఈడీ పేర్కొంది. సౌత్‌గ్రూప్‌కు రూ.100కోట్లు చేరాయని ఆరోపించింది. కవిత ఫోన్ డేటాను తొలిగించినట్లు తమ దర్యాప్తులో తేలిందని ఈడీ కోర్టుకు తెలియజేసింది. అలాగే ఆమె కుటుంబ సభ్యుల వివరాలను ఇవ్వడం లేదని ఈడీ తరఫు లాయర్ ఆరోపించారు. కవిత మేనల్లుడి వ్యాపారానికి సంబంధించిన వివరాలు అడినట్లు ఈడీ తెలిపింది. ప్రస్తుతం కవిత మేనల్లుడి ఇంట్లో సోదాలు జరుగుతున్నాయని ఈడీ పేర్కొంది. కవితను ఆమె మొబైల్ ఫోన్‌కు సంబంధించిన ఫోరెన్సిక్ సైన్స్ నివేదికతో విచారిస్తున్నామని ఈడీ తరఫు లాయర్ తెలియజేశారు. సోదాల్లో మేనల్లుడి ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అంతకుముందు మీడియాతో మాట్లాడిన కవిత ఈ కేసుల రాజకీయ కోణంలో కుట్ర కేసుగా అభివర్ణించారు. ప్రస్తుతం కవిత ఈడీ విచారణను ఎదుర్కుంటున్నారు. అయితే విచారణ సమయంలో కవిత తీవ్రమైన రక్తపోటును ఎదుర్కుం టున్నారు. ఈ క్రమంలో ఆరోగ్య పరిస్థితికి సంబంధించి పీఎంఎల్‌ఏ కోర్టులో కవిత పిటిషన్ దాఖలు చేశారు. మందులు వాడుతున్నప్పటికీ రక్తపోటు నియంత్రణలోకి రావడం లేదని, ఈడీ అధికారులు వైద్య పరీక్షలు నివేదికలు అందించడం లేదని పిటిషన్‌లో తెలిపారు. వైద్య పరీక్షలు నివేదికలిచ్చేలా ఈడీకి ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానంలో కవిత పిటిషన్ దాఖలు చేశారు. మెడికల్ రికార్డ్స్ రిపోర్ట్స్ అందించాలంటూ ఎమ్మెల్సీ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌కు సంబంధించి ఈనెల 15 నుంచి కవిత ఈడీ కస్టడీలో ఉన్నారు. కస్టడీలో తనకు నిర్వహించిన మెడికల్ రిపోర్ట్స్ అందించాలని పిటిషన్‌లో కోరారు. అరెస్ట్ అయిన 15వ తేదీ నుంచి హైపర్ టెన్షన్‌తో కవిత ఇబ్బంది పడుతున్నారు. 15న న్యాయమూర్తి ముందు హాజరుపరిచిన సమయంలోనే హైపర్ టెన్షన్ విషయాన్ని తన న్యాయవాదికి కవిత చెప్పారు. ఆ విషయాన్ని కవిత తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లడంతో కవిత తరపు న్యాయవాదు లకు మెడికో లీగల్ రిపోర్ట్ అందించాలని ఈడీని న్యాయమూర్తి ఆదేశించారు. అయితే కోర్టు ఆదేశించిన తర్వాత కూడా కేవలం 15 ,16వ తేదీల మెడికల్ రిపోర్ట్ మాత్రమే అందించారని కవిత పిటిషన్‌లో వెల్లడించారు. తన తరపు న్యాయవాదులు కోరినప్పటికీ కస్టడీలోకి తీసుకున్నప్పటి నుంచి మెడికో లీగల్ రిపోర్ట్‌లు అందించలేదని తెలిపారు. 15, 16వ తేదీల్లో అందించిన మెడికల్ రిపోర్ట్స్‌లో రక్తపోటు 186/103 గా ఉందని, రక్తపోటు నియంత్రణ కోసం చిన్నపాటి ఇంజక్షన్ ఇచ్చినప్పటికిని రక్తపోటు 146/96 గా ఉందని ఎమ్మెల్సీ పిటిషన్‌లో పేర్కొన్నారు. హైపర్ టెన్షన్ తగ్గించేందుకు మెడిటేషన్ చేస్తున్నప్పటికీ తగిన ఫలితాలు కనిపించడం లేదని తెలిపారు. కస్టడీలో హైపర్ టెన్షన్ నియంత్రణలోకి రావడం లేదని.. 15వ తేదీ నుంచి అన్ని వైద్య పరీక్ష నివేదికను అందించాలని కవిత తన పిటిషన్ కోరారు. మరోవైపు ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కవిత ఈడీ కస్టడీ విచారణ శనివారంతో ముగియనుండగా ఇడి కస్టడీని కోర్టు మరో మూడ్రోజులు పెంచింది. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు ఈడీ కస్టడీ మరో మూడ్రోజులు పొడిగించడం జరిగింది. అరెస్ట్ తర్వాత ఏడు రోజులపాటు ఈడీ కస్టడీకి తీసుకున్న సంగతి తెలిసిందే. కస్టడీ ముగియడంతో ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో కవితను ఈడీ అధికారులు హాజరు పరిచారు. విచారించాల్సింది ఇంకా చాలా ఉందని.. ఈ కస్టడీలో కవిత నుంచి ఎలాంటి సమాచారం రాలేదని కోర్టుకు తెలపడంతో మూడ్రోజులపాటు కస్టడీకి న్యాయస్థానం ఒప్పుకుంది. కాగా.. ఐదు రోజుల కస్టడీ కావాలని కోరగా కోర్టు మాత్రం మూడ్రోజులకే అనుమతిచ్చింది. ఇదే కేసులో ఢిల్లీ ముఖ్యమంత్రి కేజీవ్రాల్‌ను కూడా ఆరు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని కోర్టును కోరారు. దీని బట్టి చూస్తే కేజీవ్రాల్, కవితను కలిపి విచారించే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. ఈ నెల 15న ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్టు చేసిన విషయం తెలిసిందే. గత శనివారం ఆమెకురు వారం రోజులపాటు రౌస్ అవెన్యూ కోర్టు కస్టడీ విధించింది. నేటితో కస్టడీ ముగియడంతో మధ్యాహ్నం 12.30 గంటలకు మళ్లి కోర్టులో ప్రవేశపెట్టనుంది. కాగా, హైదరాబాద్‌లోని కవిత బంధువుల ఇండ్లపై ఈడీ అధికారులు దాడులు నిర్వహిస్తున్నారు. ఇదిలావుంటే తనపై తప్పుడు కేసులు పెట్టారని ఎమ్మెల్సీ కవిత అన్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఈడీ అదుపులో ఉన్న కవిత.. కోర్టుకు వెళ్లే ముందు మీడియాతో మాట్లాడారు. తనపై కావాలని తప్పుడు కేసులు పెట్టారన్నారు.



ఇది నకిలీ కేసు అని, పొలిటికల్ కుట్ర అని ఆరోపించారు. విచారణ సమయంలో అడిగిందే మళ్లీమళ్లీ అడుగుతున్నారని అన్నారు. ఈ కేసుపై చట్టపరంగా పోరాడుతామని అన్నారు. కవితను మరో ఐదు రోజుల పాటు ఈడీ కస్టడీకి ఇవ్వాలని ఈడీ కోరింది. మెడికల్ టెస్టులు నిర్వహిస్తున్నామని కోర్టుకు ఈడీ వివరించింది. ఈడీ కస్టడీలో ఉన్న కవితను చూసేందుకు ఆమె భర్త అనిల్,
ఇద్దరు కుమారులు రౌస్ అవెన్యూ కోర్టుకు వచ్చారు. బీఆర్ ఎస్ నేతలు కూడా కోర్టు వద్దకు వచ్చారు. ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, సురేష్ రెడ్డి, మాలోత్ కవిత, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, ఇల్లందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియ, పలువురు జాగృతి,
బీఆర్ఎస్ శ్రేణులు వచ్చారు.

# భారీ ప్రచారానికి కాంగ్రెస్ నిర్ణయం

**హైదరాబాద్:** లోక్ సభ ఎన్నికలకు కాంగ్రెస్ సిద్ధమవుతోంది. తెలంగాణ నుంచే దేశ వ్యాప్తంగా ప్రచారం ప్రారంభించనుంది. ఏప్రిల్ మొదటి వారంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రచార సభకు రానున్నారు. ఈ సందర్భంగా తుక్కుగూడలో భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు కాంగ్రెస్ నేతలు కసరత్తు చేస్తున్నారు. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. సార్వత్రిక సమరంలో గెలుపే లక్ష్యంగా ఆరోజు మేనిఫెస్టో విడుదల చేయనున్నారు. లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలైన తరువాత కాంగ్రెస్ ఏర్పాటు చేస్తున్న మొదటి సభ ఇదే కావడంతో ఆ పార్టీ ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. సభ సక్సెస్ చేయడానికి నేతలు కష్టపడుతున్నారు. ఇప్పటికే రాష్ట్ర మంత్రులు తుక్కుగూడ మైదానాన్ని సందర్శించారు. అసెంబ్లీ ఎన్నికలకు మందు కూడా తుక్కుగూడలో సోనియా తదితరులతో భారీ బహిరంగ సభ నిర్వహించి ఆరు గ్యారెంటీలను ప్రకటించారు. ఈ క్రమంలో అదే సెంటిమెంటుతో తెలంగాణ కాంగ్రెస్ ఏప్రిల్ మొదటి వారంలో తుక్కుగూడలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేత రాహుల్ గాంధీతోపాటు పలువురు ఏఐసీసీ ముఖ్యనాయకులు హాజరవుతారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇటీవల ఏఐసీసీ విడుదల చేసిన ఎన్నికల మేనిఫెస్టోను తెలుగులో ఇక్కడ మల్లికార్జున ఖర్గే విడుదల చేస్తారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తర్వాత ఏర్పాటు చేస్తున్న ఈ సభ నుంచే ఎన్నికల ప్రచారాన్ని మొదలు పెట్టనున్నట్టు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఈ మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఇతర ముఖ్య నాయకులు కలిసి నిర్ణయం తీసుకున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి.

# కత్తులు నూరుతున్న పార్టీలు

**హైదరాబాద్:** తెలంగాణలో టీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు దూకుడుగా తమ రాజకీయాలకు పదును పెడుతున్నాయి. ఎవరికి వారు పరస్పర విమర్శలతో వ్యూహ రచనలకు పూను కుంటున్నారు. ప్రత్యర్థులకు ఆలోచనలకు అందకుండా వ్యూహాలు రచించేస్తున్నారు. బిఆర్ఎస్ లక్ష్యంగా బిజెపి, కాంగ్రెస్ విమర్శలకు దిగుతున్నారు. గతంలో పదేళ్ల బిఆర్ఎస్ పాలనా పాపాలను లక్ష్యంగా చేసుకుని కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికల్లో కూడా అదే అస్త్రం కాబోతున్నది. అయితే గత వందరోజుల పాలన తీరు కాంగ్రెస్‌కు అనుకూలంగా ఉంది. ప్రజల్లో కూడా సానుకూలత ఏర్పడింది. దీంతో ఆ పార్టీ అత్యధిక ఎంపి సీట్లు గెల్చుకునేందుకు వ్యూహం పన్నుతోంది. మరీ ముఖ్యంగా సిఎం రేవంత్ రెడ్డి పాలనాతీరు ప్రజల్లో బాగా నాటుకు పోయింది. ఆయన పట్ల ప్రజల్లో ఆరాధనా భావం ఏర్పడుతోంది. ఏదైనా చేయగలడన్న నమ్మకం ఏర్పడింది. అలాగే మోడీ పాలనా వైఫల్యాలను కూడా కాంగ్రెస్ ప్రచారంలో ఎండగట్టబోతున్నది. మరోవైపు ఎన్నికల్లో అభ్యర్థులను దింపడమే కష్టంగా మారిన తరుణంలో కెసిఆర్ వ్యూహం ఎలా ఉంటుందో చెప్పడం కష్టం. ప్రజల్లో ఆదరణ కోల్పోవడంతో ఆ పార్టీకి ఎంపి సీట్లు గెలవడం గడ్డుగా మారింది. ఇప్పటికే బిజెపి, కాంగ్రెస్ లక్ష్యంగా కెసిఆర్ మెల్లగా విమర్శలకు దిగుతున్నారు. కేజ్రీవాల్ అరెస్ట్‌పై తొలిసారిగా స్పందించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ప్రస్తుతం తెలంగాణ బిఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌లతో పాటు ఇతర పార్టీలు ఉన్నా.. తారాస్థాయి పోరుమాత్రం కాంగ్రెస్, బీజేపీల మధ్యనే ఉండబోతోంది. ఇటీవల చేసిన కొన్ని సర్వేల్లో బిజెపి,కాంగ్రెస్‌లకు మాత్రమే పోటీ ఉంటుందని సర్వేలు చెబుతున్నాయి. దీంతో ఆయా రాజకీయ పార్టీలు తమ నమ్మకమైన సంస్థలతో సర్వేలు చేయించు కుంటున్నాయి. సర్వేల్లో వచ్చిన ఫలితాలకు కూడా ప్రాధాన్యత ఇస్తూ.. తమతమ పార్టీల బలోపేతానికి కృషి చేసే ఆలోచనల పడ్డారు అగ్రనేతలు. పార్లమెంటులో గెలవడం ఈ మూడు పార్టీలకు అవసరం. అందుకే ఆచితూచి అడుగులు వేస్తున్నారు. బీజేపీ నేతలు సైతం తమ సర్వే ఫలితాల్లో పార్టీ ఏ చోట బలహీనంగా ఉంది.. ప్రజలు దృష్టిని ఆకర్షించేందుకు వేయాల్సిన ఎత్తుగడలేంటని కసరత్తు మొదలెట్టారు. మొన్నటి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో బిఆర్ఎస్‌కు ప్రత్యమ్నాయంగా నిలిచింది. టీపీసీసీ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి నియామకమైన నాటి నుంచి తనదైన శైలిలో ముందుకు పోతున్న విషయం తెలిసిందే. రేవంత్ రెడ్డి అధ్యక్ష పదవిని చేతబూని.. అంపశయమీద ఉన్న తెలంగాణ కాంగ్రెస్‌కు ఊపిరి పోశారని రాజకీయ విశ్లేషకులు అప్పుడే
చెప్పారు. సిఎంగా బాధ్యతలు చేపట్టాక అందరినీ కలుపుకోని వెళ్తున్నట్లు ఉన్న రేవంత్ రెడ్డికి.. పార్లమెంట్ ఎన్నికల్లో సీట్లు సాధించడం సవాల్ లాంటిదే. సర్వేల్లో చూస్తే.. కాంగ్రెస్‌పై ప్రజల్లో నమ్మకం ఉంది.. ఎన్నికల నాటికి సిద్ధమయ్యేందుకు అన్ని పార్టీలు వ్యూహాలు పన్నుతున్నాయి.

# కవిత అరెస్ట్‌పై కెసిఆర్ ఎందుకు స్పందించలేదు



**హైదరాబాద్:**తప్పు చేసిన వారిని అరెస్టు చేస్తే కక్ష సాధింపు ఎలా అవుతుందో కేసీఆర్ సమాధానం చెప్పాలని కేంద్రమంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. కవిత అరెస్ట్‌కు తెలంగాణకు సంబంధం ఏమిటని ప్రశ్నించారు. శనివారం నాంపల్లిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. దిల్లీ మద్యం కుంభకోణం కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థలు పలుమార్లు నోటీసులు ఇచ్చినా.. సమాధానం ఇవ్వకుండా తప్పించుకున్నారన్నారు. దిల్లీ లిక్కర్ స్కామ్‌లో సాక్ష్యాలు ఉన్నాయి. ఈ కేసులో తమ కుటుంబానికి, దిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు సంబంధం లేదని కేసీఆర్ చెప్పగలరా అని ప్రశ్నించారు. మద్యం పాలసీలో దిల్లీలోని ఆప్ ప్రభుత్వం అవకతవకలు చేసింది. దిల్లీలో తీగ లాగితే తెలంగాణలో దొరికింది. కేజ్రీవాల్, కవిత అరెస్టును దేశమంతా సమర్థిస్తోంది. ఈ కేసుకు సంబంధించి కేసీఆర్‌తో చర్చకు మేం సిద్ధం. అక్రమాలను ఆధారాలతో సహా నిరూపిస్తా. కేజ్రీవాల్ తప్పు లేదని కేసీఆర్ నిరూపించగలరా అని నిలదీసారు. కవిత అరెస్టుకు తెలంగాణ రాజకీయాలకు సంబంధం లేదని అన్నారు. కేజ్రీవాల్ అరెస్టును ఖండించిన కేసీఆర్.. కవిత అరెస్టుపై ఎందుకు స్పందించలేదన్నారు. కవిత అరెస్టు విషయంలో కేసీఆర్ మౌనానికి కారణమేంటో ప్రజలకు చెప్పాలి. కాళేశ్వరం అవినీతిపై దమ్ముంటే సీఎం రేవంత్‌రెడ్డి సీబీఐ విచారణ జరిపించాలన్నారు. తెలంగాణలోని 17పార్లమెంట్ స్థానాల్లో భాజపా ఒంటరిగానే పోటీ చేస్తుందని కిషన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌పై కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తాజాగా మాజీ సీఎం కేసీఆర్‌కు ఓ సూటి ప్రశ్న సంధించారు. ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ అరెస్ట్‌ను ఖండించిన కేసీఆర్.. కూతురు కవిత అరెస్ట్‌పై ఎందుకు స్పందించలేదని నిలదీశారు. కవిత అరెస్ట్ విషయంలో కేసీఆర్ మౌనానికి గల కారణమేంటో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఢిల్లీ లిక్కర్ పాలసీ మార్పులో కవిత ప్రమేయం ఉందని ఈడీ చెప్తోందని, అందుకే ఆమెను అరెస్ట్ చేయడం జరిగిందని చెప్పారు. కవిత అరెస్ట్‌తో బీజేపీకి గానీ, కేంద్ర ప్రభుత్వానికి గానీ ఎలాంటి సంబంధం లేదని క్లారిటీ ఇచ్చారు. లిక్కర్ పాలసీని మార్చినందుకు ఆప్ ఆద్మీ పార్టీకి నిధులు సమకూరాయని చెప్పిన కిషన్ రెడ్డి.. కవిత అరెస్ట్‌పై బీఆర్ఎస్ అవాస్తవాలను ఖండించారు. అవినీతి చేసిన ముఖ్యమంత్రిని అరెస్ట్ చేస్తే.. బ్లాక్ డే ఎలా అవుతుందని ప్రశ్నించారు. ఇందుకు కేసీఆర్ సమాధానం చెప్పాలని అడిగారు. కుటుంబ రాజకీయాలు, వారసులు ప్రజాప్రతినిధులు అవటం కూడా బ్లాక్ డేనేనా? అని ప్రశ్నించారు. తెలంగాణలో దోచుకున్నట్లు.. కేసీఆర్ కుటుంబం ఢిల్లీలో కూడా దోచుకుందని సంచలన ఆరోపణలు గుప్పించారు. కవిత అరెస్ట్‌తో తెలంగాణకు ఎలాంటి సంబంధం లేదని.. ఆమె అరెస్ట్‌తో తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి మార్పు రాదని తేల్చి చెప్పారు. తెలంగాణలో లిక్కర్ అమ్మకాలపై రాహుల్ గాంధీ టాక్స్ వేస్తున్నారని కిషన్ రెడ్డి వ్యాఖ్యానించారు. తెలంగాణలో తీగ లాగితే ఢిల్లీలో డొంక కదులుతోందని..
తెలంగాణ లిక్కర్ పాలసీలనే ఢిల్లీ ప్రభుత్వం అనుసరించిందని తెలిపారు. అభ్యర్థి ఎవరైనా సికింద్రాబాద్ పార్లమెంట్‌లో గెలుపు తనదేనని ధీమా వ్యక్తం చేశారు. ప్రస్తుతం తన దృష్టి ప్రచారంపైనే ఉందని, అభ్యర్థి ఎవరైనా తనకు భయం లేదని అన్నారు. సికింద్రాబాద్ సహా.. అన్ని లోక్‌సభ స్థానాల్లో బీజేపీ గెలుస్తుందని నమ్మకం వెలిబుచ్చారు. బీఆర్ఎస్ అవసరం తెలంగాణకు లేదని.. తమకు కాంగ్రెస్ పార్టీతోనే పోటీ అని పేర్కొన్నారు. ఇదిలావుంటే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మే 13వ తేదీన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఓటింగ్ సమయంలో హైదరాబాద్ నగరంలో ఏ ఎన్నిక వచ్చిన 40శాతం మించి పోలింగ్ జరగడం లేదని చెప్పారు. ఈ సారి ఎంపీ ఎన్నికల్లో హైదరాబాద్‌లో ఓటింగ్ శాతం పెరగాలని కోరారు. సౌకర్యాలు లేవని ప్రతీ ఒక్కరూ విమర్శిస్తారని.. కానీ ఓటు ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. విమర్శించడానికి ఎంత హక్కు ఉందో ఓటు వేసే బాధ్యత కూడా అంతే ఉందని గుర్తించాలని అన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో ప్రతీ ఒక్కరూ కుటుంబ సభ్యులతో చర్చించి అభివృద్ధి చేసే నేతలకు ఓటువేయాలని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో పాకిస్తాన్ వాళ్లకు ఆడిందే ఆట, పాడిందే పాటగా మారిందని విమర్శించారు. గత తొమ్మిదిన్నరేళ్లుగా పాకిస్తాన్‌కి సంబంధించిన ఐఎస్ఐ ఉగ్రవాదులు దేశంలో చొరబడకుండా ప్రధానమంత్రి నరేంద్రమోదీ చర్యలు తీసుకున్నారని వివరించారు. ఉక్రెయిన్, రష్యా యుద్ధాన్ని ఆపి.. ఆ దేశంలో చిక్కుకున్న 25 వేల మంది భారతీయులను స్వదేశానికి మోదీ తీసుకొచ్చారని చెప్పారు. కాంగ్రెస్ హయాంలో దేశం ఎలా ఉంది.. మోదీ హయాంలో దేశం ఎలా ఉందో తేడా చూసి లోక్‌సభ ఎన్నికల్లో ఓటు వేయాలని కిషన్ రెడ్డి కోరారు. ఇదిలావుంటే బేగంపేటలోని ఓ ఇంట్లో చోరీకి వచ్చిన దుండగులను చాకచక్యంగా తరిమేసిన ఘటన సమాజానికి స్ఫూర్తిదాయకమని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బేగంపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని జైన్ కాలనీలో దోపిడికి ప్రయత్నించిన దొంగలతో తెగువ చూపి పోరాడిన తల్లికూతుళ్లుని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అభినందించారు. ఈ ఘటనలో ధైర్య సాహసాలు ప్రదర్శించిన అమిత, భవి లకు కేంద్ర ప్రభుత్వం తరఫున ప్రశంసా పత్రాలను అందజేశారు. తుపాకీతో బెదిరించి దోపిడీకి యత్నించిన దొంగలను అడ్డుకొని వారిని ప్రతిఘటించి పోరాడిన తల్లి కూతుర్లు మహిళలకు ఆదర్శప్రాయమని అన్నారు. ప్రతి మహిళ విపత్కర సమయాలలో ఆత్మ రక్షణ నిమిత్తం ఎదుర్కొనేందుకు యుద్ధ కళలను నేర్చుకోవాలని సూచించారు. నారి శక్తి అంటే ఏంటో తల్లి కూతుర్లు నిరూపించారని ఆయన వారిని పొగిడారు. విద్యాసంస్థలలో చిన్ననాటి నుండి విద్యార్థినులకు మార్షల్ ఆర్ట్స్ నేర్పించే విధంగా ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని ఆయన కోరారు.

# రేవంత్ రెడ్డి స్థాయిని తగ్గించుకుంటున్నడు..

# చెబుదామంటే టైమ్ ఇస్తలేడు




సీఎం రేవంత్ రెడ్డిపై కీలక కామెంట్స్ చేశారు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వీహెచ్. రేవంత్ తన స్థాయిని తగ్గించుకొని ప్రతిపక్ష నేతల ఇళ్లకు వెళ్తున్నారన్నారు. వాళ్ల వద్దకు వెళ్లి పార్టీలోకి ఆహ్వానించటం సరైంది కాదని అన్నారు. అవసరమైతే వాళ్లే సీఎం వద్దకు రావాలని చెప్పారు. ఇదే విషయం చెబుదామంటే రేవంత్ సమయం ఇవ్వటం లేదని అన్నారు.

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిపై కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి. హనుమంతరావు హాట్ కామెంట్స్ చేశారు. రేవంత్ తన స్థాయిని తానే తగ్గించుకుంటున్నాడని అన్నారు. ఇటీవల పలువురు ప్రతిపక్ష నేతలకు ఇళ్లకు వెళ్లి కాంగ్రెస్ పార్టీలోకి రావాలని సీఎం రేవంత్ రెడ్డి వారిని ఆహ్వానించటంపై ఆయన విమర్శలు చేశారు. సీఎం తన స్థాయిని తగ్గించుకొని.. వాళ్ల వద్దకు వెళ్లి పార్టీలోకి ఆహ్వానించటం సరైంది కాదని అన్నారు. ఇదే విషయం చెబుదామంటే అపాయింట్‌మెంట్ ఇవ్వటం లేదన్నారు. 'రేవంత్ రెడ్డి నువ్వు ముఖ్యమంత్రివి.. నిన్ను కలవాలంటే నీ దగ్గరకు వాళ్ళు రావాలి. నువ్వు వాళ్ళ దగ్గరికి వెళ్లి ఆహ్వానించడం కరెక్ట్ కాదు. నీ స్థాయి నువ్వే తగ్గించుకుంటున్నావు. రేవంత్ రెడ్డిని నేను కలిసి చెపుతామంటే టైమ్ ఇస్తలేడు. తక్కువ సమయంలో ముఖ్యమంత్రి అయింది రేవంత్ రెడ్డి ఒక్కడే. పార్టీని బలోపేతం చేసి అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించాడు. కానీ ఇప్పుడు పరిస్థితులు చూసి కార్యకర్తలు బాధపడుతు న్నారు. బీఆర్ఎస్ పార్టీని కాదని.. కాంగ్రెస్‌ను గెలిపించారు.

**బీఆర్ఎస్‌కు భారీ షాక్.. కాంగ్రెస్ గూటికి**

**దానం, రంజిత్ రెడ్డి**

కాంగ్రెస్ కేడర్‌కు న్యాయం చేయకుండా మన కార్యకర్తలపై కేసులు పెట్టినవాళ్లకు ఇప్పుడు ప్రాధాన్యత ఇస్తున్నారు. అక్రమంగా డబ్బు సంపాదించి ఇప్పుడు అధికారంలో ఉన్నామని వివిధ పార్టీల్లో నుంచి కాంగ్రెస్‌లోకి వస్తున్నారు. రేవంత్ రెడ్డి ఒక్క సైడ్ మాత్రమే వినకు. రెండు సైడ్స్ వినాలని కోరుతున్నా. పార్టీ కార్యకర్తలలకు అన్యాయం చేయకండి. నేను రేవంత్ రెడ్డికి వ్యతిరేకం కాదు ఎవ్వరికి అన్యాయం జరగొద్దనేది నా ఆవేదన.' అని వీహెచ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీలో సీనియర్‌గా ఉన్న వీ హనుమంతరావు అసెంబ్లీ ఎన్నికల్లో అంబర్ పేట నుంచి పోటీ చేయాలని భావిచంగా.. పార్టీ టికెట్ నిరాకరించింది. ఒకానొక సమయంలో తాను కూడా సీఎం రేసులో ఉన్నట్లు చెప్పుకున్నారు. ఆ తర్వాత పార్టీ అధికారంలోకి రాగా.. ఖమ్మం ఎంపీ సీటు ఇవ్వాలని పట్టుబడ్డారు. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో మాదిరిగానే ఆయనకు సీటు ఇవ్వటం కుదరదని పార్టీ వర్గాలు వెల్లడించినట్లు తెలిసింది.

# ఇక వాళ్లతో కలిపి ఇంటరాగేషన్..!



ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో అరెస్టయిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ఏడు రోజుల కస్టడీ నేటితో ముగియగా.. ఆమెను కోర్టు ఎదుట హాజరుపరిచారు. కవితను మరో 5 రోజుల పాటు కస్టడీకి అనుమతించాలని ఈడీ అధికారులు.. న్యాయస్థానాన్ని కోరుతూ వాదనలు వినిపించారు. ఈడీ వాదనలు విన్న న్యాయస్థానం.. కవితను మరో 3 రోజుల పాటు కస్టడీకి అనుమతించింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో మరో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అధికారులు అరెస్ట్ చేయగా రౌస్ ఎవెన్యూ కోర్టు 7 రోజుల కస్టడీ విధించగా.. అది నేటితో ముగిసిపోయింది. ఈ క్రమంలో.. ఆమెను మళ్లీ కోర్టు ఎదుట హాజరు పరిచారు ఈడీ అధికారులు. ఈ క్రమంలో.. కవితను మరో ఐదు రోజుల కస్టడీకి ఇవ్వాలని న్యాయస్థానాన్ని ఈడీ అధికారులు కోరింది. అయితే.. కవిత నుంచి ఇంకా కొంత సమాచారం రాబట్టాల్సి ఉందని.. మిగతా నిందితులతో కలిపి విచారించాలని ఈడీ కోరింది. ఈడీ వాదనలు విన్న రౌస్ ఎవెన్యూ కోర్టు.. కవితను మరో మూడు రోజుల కస్టడీకి అనుమతించింది. అయితే.. విచారణకు కవిత సహకరించలేదని.. న్యాయస్థానానికి ఈడీ తెలిపింది. ఆమె కుటుంబ సభ్యుల వివరాలను వెల్లడించటంలేదన్నారు. కవిత ఫోన్‌లోని డేటాను కూడా విశ్లేషించామని.. కానీ చాలా డేటాను తొలిగించారని వివరించారు. కవిత మేనల్లుడికి సంబంధించిన వ్యాపార వివరాలు కూడా అడిగామన్నారు. సోదాల్లో కవిత మేనల్లుడి ఫోన్లు కూడా స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. అయితే.. తాను మాత్రం ఏమీ తెలియదని సమాధానమిస్తున్నట్టు చెప్పారు. సౌత్ గ్రూప్‌కు 100 కోట్ల రూపాయల ముడుపులు అందాయని కోర్టుకు ఈడీ తెలిపింది. లిక్కర్ కేసులో రూ. కోట్లలో కిక్ బ్యాక్‌లు అందాయని ఈడీ అధికారులు ఆరోపించారు. సమీర్ మహీంద్రాతో కలిపి కవితను ప్రశ్నించాలని కోర్టుకు తెలిపారు. కవిత మేనల్లుడికి సమీర్ మహీంద్రా నుంచి ముడుపులు అందిన తీరుపై సమాచారం తీసుకోవాల్సి ఉందని కోర్టుకు ఈడీ అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే.. ఈడీ కస్టడీలో ఉన్న కవితను బ్యాంక్ స్టేట్ మెంట్లు, ఐటీ పత్రాలు అడుగుతున్నారని కవిత తరపు న్యాయవాది తెలిపారు. కస్టడీలో ఉండగా.. ఈడీ అధికారులు అడిగిన పత్రాలు ఎలా తీసుకురాగలరని ప్రశ్నించారు. అయితే.. ఈడీ వాదనలతో ఏకీభవించిన కోర్టు.. కవితకు మరో మూడు రోజులపాటు కస్టడీని పొడిగిస్తూ తీర్పునిచ్చింది.

**కవిత బెయిల్ పిటిషన్..**

మరోవైపు.. తనకు బెయిల్ ఇవ్వాలని సెషన్స్ కోర్టులో కవిత పిటిషన్ దాఖలు చేశారు. కాగా.. బెయిల్ పిటిషన్‌ను ఈడీ వ్యతిరేకించి ంది. ప్రస్తుతం బెయిల్‌కు విచారణ అర్హత లేదని ఈడీ వాదించింది. పిటిషన్‌పై ఈడీకి నోటీసులు ఇవ్వాలని కవిత తరపు న్యాయవాది కోరారు. దీంతో.. కవిత పిటిషన్ విచారణకు కోర్టు స్వీకరించింది. 26వ తేదీన కవిత బెయిల్ పిటిషన్‌పై విచారించనుంది.

**కోర్టులో కవిత రియాక్షన్ ఇదే..**

తనది అక్షరాల అక్రమ అరెస్టేనని కోర్టు ప్రాంగణంలో కవిత చెప్పుకొచ్చారు. ఏడాది కిందట అడిగిన విషయాలనే మళ్లీ అడిగారని చెప్పుకొచ్చారు. ఈ అరెస్ట్‌పై తాను న్యాయ పోరాటం చేస్తానని ప్రకటించారు. ఇది పక్కా రాజకీయ దురుద్దేశంతో పెట్టిన తప్పుడు కేసని కవిత అభిప్రాయపడ్డారు.

**కవిత మరో పిటిషన్..**

తమ ఆరోగ్య పరిస్థితికి సంబంధించి పీఎంఎ ల్ఏ కోర్టులో కవిత పిటిషన్ దాఖలు చేశారు. తనకు హైబీపీ ఉందని.. మందులు వాడుతు న్నప్పటికీ కంట్రోల్ కావట్లేదన్నారు. ఈడీ అధికారులు వైద్య పరీక్షలు రిపోర్టులు ఇవ్వటం లేదని పిటిషన్‌లో తెలిపారు. ఎప్పటికప్పుడు రిపోర్టులు ఇచ్చేలా ఈడీకి ఆదేశాలు ఇవ్వాలని పిటిషన్‌లో పేర్కొన్నారు. మెడికల్ రికార్డ్స్ రిపోర్ట్స్ అందించా లంటూ ఎమ్మెల్సీ న్యాయస్థానాన్ని కవిత కోరారు.

# 9వ తరగతి స్టూడెంట్ ఆవిష్కరణకు కలెక్టర్ ఫిదా..

బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ పెట్టుకొండి. అది బరువు కాదు బాధ్యత అని పోలీసులు ఎన్ని రకాలుగా చెప్పినా చాలా మంది ఇప్పటికీ నిర్లక్ష్యం చేస్తూనే ఉన్నారు. అయితే.. ద్విచక్రవాహనదారులకు జరిగే ప్రమాదాల్లో హెల్మెట్ పెట్టుకోకపోవటం వల్ల చనిపోయే వాళ్లే చాలా మంది ఎక్కువ అని తెలిసి.. మంచిర్యాల జిల్లా నస్పూర్‌కు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి అద్భుత ఆవిష్కరణ చేశాడు. అది చూసి.. జిల్లా కలెక్టర్ కూడా ఫిదా అయ్యారం టే.. ఎంత స్మార్ట్ ఆవిష్కరణో ఆలోచించండి. ఈ జనరేషన్ పిల్లలు చాలా స్మార్ట్. అరచేతిలోనే ప్రపంచాన్ని చూపిస్తున్న స్మార్ట్ ఫోన్ల యుగంలో అందరికంటే మెరుగ్గా బతకటం కాదు.. తమ టాలెంట్‌తో ప్రపంచాన్ని తమవైపు తిప్పుకునేలా చేయటమే ఈ జనరేషన్ టార్గెట్. అందుకే.. పిల్లల్లా కాదు.. చిచ్చరపిడుగుల్లా.. ఒక్కొక్కరు ఒక్కో టాలెంట్‌తో దూసుకుపోతున్నారు. విద్యార్థి దశలోనే అద్భుతాలు క్రియేట్ చేస్తూ.. ప్రశంసలు అందుకుంటున్నారు. ఈ కోవలోకే వస్తాడు.. మంచిర్యాల జిల్లా నస్పూర్‌కు చెందిన వెన్నంపల్లి సాయి సిద్ధాంత్ అనే తొమ్మిదో తరగతి విద్యార్థి. సాయి చేసిన ఆవిష్కరణకు జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ కూడా ఫిదా అయ్యారంటే.. ఆ పిల్లాడి ఆలోచన ఎంత స్మార్ట్‌గా ఉందో అర్థం చేసుకోవచ్చు. అయితే.. మన దేశంలో గంటకు 19 మంది రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. అందులోనూ ద్విచక్రవాహనాల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతుండగా.. హెల్మెట్ పెట్టుకోకపోవడం కారణంగానే చాలా మంది ప్రాణాలు కోల్పోతున్నట్టుగా పలు సర్వేలు చెప్తున్నాయి. అయితే.. వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ పెట్టుకోవాలని పోలీసులు పదే పదే హెచ్చరిస్తున్నా.. పెట్టుకోని వారికి భారీ జరిమానాలు విధిస్తున్నా.. ఎన్ని రకాలుగా చర్యలు తీసుకున్నా కొంత మంది వాహనదారు లు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ.. ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. నస్పూర్‌లో స్థానికంగా ఉన్న ఓ ప్రైవేట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న సాయి... హెల్మెట్



సాయిని అతన్ని ప్రోత్సహిస్తోన్న తల్లిదండ్రులను కలెక్టర్ కార్యాలయా నికి పిలిపించి ప్రశంసించారు.

ధరించకుండా బండి నడపడం కారణంగా చాలామంది ప్రాణాలను కోల్పోతున్నారన్న విషయం తెలిసి తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. ఎలాగైనా ప్రజలు కచ్చితంగా హెల్మెట్ ధరించేలా చేయాలి అనుకున్నాడు. అవగాహన కార్యక్రమా లు ఎన్ని చేసినా.. ఆ సమయానికి విని కాసేపటికే మర్చిపోతారు. అలా కాకుండా ఏదైనా కొత్తగా చేయాలని తన మెదడుకు పని చెప్పాడు. చివరికి అదిరిపోయే ఆవిష్కరణ చేశాడు. బండి మీద వెళ్లేటప్పుడు హెల్మెట్ పెట్టుకోవాలనుకున్నా సరే.. తొందరలోనో, ఏదో పనిలో పడో మర్చిపోతుం టాం. అదే.. హెల్మెట్ ఉంటే కానీ బండి స్టార్ట్ కాకపోతే.. కచ్చితంగా పెట్టుకుంటునారన్న ఆలోచన చేశాడు. అందుకోసం.. స్మార్ట్ హెల్మెట్‌ను తయారు చేశాడు. హెల్మెట్ పెట్టుకుంటేనే బైక్ స్టార్ట్ అయ్యేలా స్మార్ట్ హెల్మెట్ తయారు చేశాడు సాయి. ఒక వేళ హెల్మెట్ ధరించకపోతే తలకిందులుగా తపస్సు చేసిన బైక్ స్టార్ట్ కాదు. సెన్సార్‌ను ఉపయోగించి హెల్మెట్ పెట్టుకుంటేనే బండి స్టార్ట్ అయ్యేలా స్మార్ట్ హెల్మెట్‌ను తయారుచేశాడు. ఇక ఈ విషయం తెలుసుకున్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్.. సాయిని అతన్ని ప్రోత్సహిస్తోన్న తల్లిదండ్రులను కలెక్టర్ కార్యాలయానికి పిలిపించి ప్రశంసించారు. భవిష్యత్‌లోనూ ఇలాంటి గొప్ప గొప్ప ఆవిష్కరణలు చేసి మంచి స్థాయికి రావాలని ఆకాంక్షించారు.

# ఎమ్మెల్సీ కవిత ఆడపడుచు ఇంట్లో ఈడీ సోదాలు..



ఢిల్లీ లిక్కర్ స్కాం కేసు ఊహించని మలుపులు తిరుగుతూ ఉత్కంఠను రేకెత్తిస్తోంది. అయితే.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఈడీ కస్టడీలో ఉండగా.. ఈరోజు చివరి రోజు. ఈ క్రమంలోనే.. హైదరాబాద్‌లోని కవిత, ఆమె భర్తకు సంబంధించిన బంధువుల ఇళ్లలో ఈడీ మరోసారి సోదాలు నిర్వహిస్తోంది. కవిత ఆడపడుచు అఖిల ఇంట్లో ఉదయం నుంచే ఈడీ అధికారులు సోదాలు నిర్వహిస్తుండటం.. సర్వత్రా ఉత్కంఠగా మారింది. ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో ఊహించని పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను అరెస్ట్ చేసి కస్టడీలోకి తీసుకున్న విషయం తెలిసిందే. అయితే.. ఈరోజు కవితది కస్టడీ చివరి రోజు కాగా.. హైదరాబాద్‌లో మరోసారి ఈడీ సోదాలు మొదలుపెట్టింది. కవిత బంధువుల ఇళ్లతో పాటు.. ఆమె భర్త అనిల్ కుమార్ బంధువుల ఇళ్లలోనూ ఈడీ అధికారులు విస్తృతంగా సోదాలు నిర్వహిస్తున్నారు. మాదాపూర్‌లో ఉన్న కవిత ఆడపడుచు అఖిల ఇంట్లోనూ ఈడీ అధికారులు తనిఖీలు చేస్తున్నారు. శనివారం తెల్లవారుజాము నుంచే అఖిల నివాసంలో అధికారులు సోదాలు నిర్వహిస్తున్నారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్ లో పెద్ద ఎత్తున మనీ ల్యాండ్రింగ్ జరిగిందని భావిస్తున్న ఈడీ.. కవితకు చాలా క్లోజ్‌గా ఉన్న ఆమె ఆడపడుచు అఖిల ఇంట్లో సోదాలు నిర్వహిస్తున్నారు. అఖిలకు సంబంధించి 3 సంవత్సరాల ఆర్థిక లావా దేవిలపై అధికారులు ఆరా తీస్తున్నట్టు సమాచారం. అఖిలకు సంబంధించిన బ్యాంకు అకౌంట్లు, ట్రాన్సాక్షన్స్, ల్యాండ్ డాక్యుమెంట్స్, బంగారం వివరాలను తనిఖీ చేస్తున్నారు అధికారులు. ఈడి అధికారులతో పాటు మదాపూర్ పోలీసులు కూడా అఖిల ఇంటికి చేరుకున్నారు. మాదాపూర్‌లోని డీఎస్ఆర్ రేగంటి అపార్ట్‌మెంట్‌లోని మూడో ఫ్లోర్‌లో ఉంటున్న అఖిల కుటుంబం.. ఈడి అధికారులు వచ్చినప్పుడు ఇంట్లోనే ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో.. వారి ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం. మార్చి 15న హైదరాబాద్‌లోని కవిత ఇంట్లో ముమ్మర సోదాలు నిర్వహించిన ఈడీ అధికారులు.. కవితతో పాటు ఆమె భర్త అనిల్ కుమార్ లావాదేవీలు, ఆస్తుల వివరాలపై ఆరా తీశారు. విచారణకు రావాలని కూడా నోటీసులివ్వగా.. ఆయన వెళ్లలేదు. అయితే.. ఇప్పుడు కవిత కస్టడీ చివరి రోజున ఇలా.. తమ బంధువుల ఇళ్లలో ముమ్మర తనిఖీలు చేయటం సర్వత్రా ఉత్కంఠను రేకెత్తిస్తోంది. అయితే.. కవిత నుంచి ఇప్పటికే సుమారు 16 మొబైల్ ఫోన్లను ఈడీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆమె భర్త అనిల్‌తో పాటు పీఆర్వో రాజేష్, ముగ్గురు అసిస్టెంట్ల ఫోన్లను కూడా అధికారులు సీజ్ చేశారు. కాగా.. కస్టడీ రిపోర్టులోనూ సంచలన విషయాలు వెల్లడించింది ఈడీ. కాగా.. ఈరోజు కస్టడీ ముగుస్తుండటంతో.. మధ్యాహ్నం 12 రౌస్ ఎవెన్యూ కోర్టులో హాజరుపర్చాల్సి ఉండగా.. కోర్టు ఎలాంటి తీర్పు ఇవ్వనుందన్నది ఉత్కంఠగా మారింది.

# ఫోన్ ట్యాపింగ్ కేసులో విస్తుపోయే విషయాలు..

# వెలుగులోకి మాజీ ఉన్నతాధికారుల చిట్టా..!



తెలంగాణలో ప్రకంపనలు సృష్టిస్తున్న ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక మలుపు చోటుచేసు కుంది. ఇప్పటికే పోలీసుల కస్టడీలో ఉన్న ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు ఇచ్చిన స్టేట్ మెంట్ ఆధారంగా మరికొందరు మాజీ ఉన్నతాధికారుల ఇళ్లలో సోదాలు నిర్వహిస్తు న్నారు. ఈ క్రమంలో కీలక ఆధారాలు బయట పడుతున్నట్టు తెలుస్తోంది. కాగా.. ఇందులు కీలక పాత్ర పోషించిన ఇద్దరుముగ్గురు అధికారులు ఇప్పటికే హైదరాబాద్ వదిలి వెళ్లిపోయినట్టు కూడా తెలుస్తోంది. తెలంగాణలో సంచలనంగా మారిన ఫోన్ ట్యాపింగ్ కేసులో రోజుకో ట్విస్ట్ వెలుగు చూస్తోంది. ఇప్పటికే ఎస్ఐబీ మాజీ డీఎస్పీ ప్రణీత్ రావును అరెస్ట్ చేసి విచారిస్తుండగా.. ఈ కేసులో మరింత మంది ఉన్నతాధికారుల పాత్ర ఉన్నట్టు బయటపడు తోంది. ప్రణీత్ రావు ఇచ్చిన కన్ఫెషన్ ఆధారంగా.. పలువురు మాజీ పోలీస్ అధికా రుల ఇళ్లతో పాటు ఓ న్యూస్ ఛానల్ ఎండీ ఇంట్లో కూడా పంజాగుట్ట పోలీసులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. అయితే.. ఈ కేసులో పలువురు మాజీ ఉన్నతాధికారులు కీలక పాత్ర పోషించారని.. కాల్ రికార్డింగులను అడ్డం పెట్టుకుని బెదిరించి వందల కోట్లు వసూళ్లకు పాల్పడినట్టు తెలుస్తోంది. మాజీ డీఎస్పీ ప్రణీత్ రావు కేసులో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగు తోంది. ప్రణీత్ రావు ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా పలువురు అనుమానితుల నివాసాల్లో సోదాలు చేస్తున్నారు పోలీసులు. ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు ఇంటితో పాటు ఇంటెలిజెన్స్ మాజీ అదనపు ఎస్పీ భుజంగరావు, ఎస్ఐబీ డీఎస్పీ తిరుపతన్న, హైదరాబాద్ సిటీ మాజీ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాధా కిషన్ రావు ఇంట్లో సోదాలు నిర్వహిస్తు న్నారు. కాగా.. ఏకకాలంలో 10 చోట్ల సోదాలు నిర్వహిస్తు న్నారు. ఈ సోదాల్లో భాగంగా ఓ అధికారి ఇంటి నుంచి 2 లాప్‌టాప్‌లు, 4 ట్యాబ్‌లు, 5 పెన్ డ్రైవ్‌లు, ఒక హార్డ్ డిస్క్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలుస్తోంది. మాజీ అధికారులతో పాటు మరో ఇద్దరు అడిషనల్ ఎస్పీలు, ఇద్దరు డీఎస్పీల పాత్రపై దర్యాప్తు కొనసాగుతోంది. అయితే.. ఈ కేసులో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు పాత్ర కీలకమని అధికారులు భావిస్తున్నారు. కాగా.. ప్రభాకర్ రావు, రాధాకిషన్ ఇప్పటికే హైదరాబాద్ వదిలిపెట్టి వెళ్లిపోయినట్టు సమాచారం. ఇదిలా ఉంటే.. ప్రణీత్ రావు కేసులో విచారణకు అడిషనల్ ఎస్పీ తిరుపతన్న హాజరయ్యారు. గతంలో ఎస్ఐబీలో తిరుపతన్న అడిషనల్ ఎస్పీగా విధులు నిర్వర్తించారు. బంజారాహిల్స్ పీఎస్‌కు వచ్చిన తిరుపతన్నను.. పోలీసులు విచారిస్తున్నారు. ఇదిలా ఉంటే.. ప్రణీత్‌రావు 7 రోజుల కస్టడీ నేటితో ముగియనుంది. విచారణ అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి ఆయన్ని కోర్టులో ప్రవేశపెట్టనున్నారు. అలాగే.. ఇప్పటివరకు జరిగిన విచారణలో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో తనకు సహకరించిన వారి అందరి పేర్లు ప్రణీత్ రావు వెల్లడించినట్లు తెలుస్తోంది.

# '12 మంది ఎమ్మెల్యేల ఎన్నిక చెల్లదు'..



తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందిన పలువురు ఎమ్మెల్యేల ఎన్నికలు చెల్లవంటూ హైకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. అయితే.. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన 12 మంది ఎమ్మెల్యేల ఎన్నికను సవాలు చేస్తూ వారి ప్రత్యర్థులు పిటిషన్లు దాఖలు చేయగా.. వాటిలో ఆరింటిపై విచారణ చేపట్టి.. ఆరుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేసింది న్యాయస్థానం. 2023 డిసెంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించిన 12 మంది ఎమ్మెల్యేల ఎన్నిక చెల్లదని ప్రకటించాలంటూ ఆయా స్థానాల్లో ఓడిపోయిన అభ్యర్థులు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. వాళ్లంతా ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడ్డారని.. ఓటర్లను ప్రలోభపెట్టారని, నామినేషన్ పత్రాల్లోనూ ఆస్తుల వివరాల్లో తప్పుడు సమాచారం ఇచ్చారంటూ తీవ్ర ఆరోపణలు చేయగా.. వారి ఎన్నికను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. మొత్తం 13 పిటిషన్లు దాఖలు కాగా.. ఏడింటిపై విచారణ చేపట్టిన ధర్మాసనం ఆరుగురు ఎమ్మెల్యేలకు నోటీసులు జారీ చేయటం గమనార్హం. ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ఎన్నికను సవాలు చేస్తూ కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన పి.విజయారెడ్డి పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల సమయంలో.. ఓటర్లను ప్రలోభాలకు గురిచేసి, విచ్చలవిడిగా నగదు పంపిణీ చేసి గెలిచారంటూ దానం నాగేందర్ మీద తీవ్ర ఆరోపణలు చేశారు. మరోవైపు.. తన భార్య పేరు మీద ఉన్న ఆస్తి వివరాలను కూడా ఆయన వెల్లడించలేదని విజయారెడ్డి పేర్కొన్నారు. మరోవైపు.. మహబూబ్‌నగర్ నుంచి కాంగ్రెస్ తరఫున ఎన్నికైన యన్నం శ్రీనివాస్‌రెడ్డి మీద కూడా మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పిటిషన్ దాఖలు చేశారు. పూర్తి వివరాలు లేకుండానే ఎన్నికల అధికారికి నామినేషన్‌ను సమర్పించటం.. దాన్ని ఆయన ఆమోదించడం సరికాదని.. దీని వెనుక కుట్ర ఉందని ఆరోపించారు. దేవరకద్ర నుంచి కాంగ్రెస్ తరఫున గెలుపొందిన జి.మధుసూదన్‌రెడ్డిపై బీఆర్ఎస్ తరఫున పోటీ చేసిన ఆళ్ల వెంకటేశ్వర్ రెడ్డి కూడా పిటిషన్ వేశారు. నామినేషన్ పత్రాల్లో చాలా వరకు తప్పుడు సమాచారం ఉందని ఆరోపించారు. కొత్తగూడెం నుంచి ఎన్నికైన కూనంనేని సాంబశివరావుకపై కూడా నందూలాల్ అగర్వాల్ పిటిషన్ వేశారు. నామినేషన్ పత్రాల్లో చాలా వరకు నిజాలు లేవని ఆరోపించారు. ఇక.. ఆసిఫాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి ఎన్నికను సవాలు చేస్తూ కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యాం పిటిషన్ వేశారు. మరోవైపు.. జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఎన్నికను ఛాలెంజ్ చేస్తూ రెండు పిటిషన్లు దాఖలయ్యాయి. ఒకటి కాంగ్రెస్ అభ్యర్థి అజారుద్దీన్ వేయగా.. మరొకటి సామాజిక కార్యకర్త నవీన్ యాదవ్ మరొకటి వేశారు. ఈ పిటిషన్లపై వేర్వేరుగా విచారించిన న్యాయమూర్తులు తదుపరి విచారణను ఏప్రిల్‌కు వాయిదా వేశారు. ఇదిలా ఉంటే.. గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి ఎన్నికను సవాలు చేస్తూ జడ్పీ ఛైర్‌పర్సన్ సరిత దాఖలు చేసిన పిటిషన్‌లో ఇప్పటికే నోటీసులు జారీ అయ్యాయి. అలంపూర్ ఎమ్మెల్యే విజయుడికి కూడా గురువారం నోటీసులు జారీ చేసిన సంగతి తెలిసిందే. ఇక.. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, వరంగల్ పశ్చిమ కాంగ్రెస్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ అభ్యర్థి దాస్యం వినయ్ భాస్కర్, ఖానాపూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఎన్నికపై బీఆర్ఎస్ అభ్యర్థి జాన్సన్ నాయక్ భూక్యా, వైరా కాంగ్రెస్ ఎమ్మెల్యే రాందాస్ మాలోత్ ఎన్నికను సవాల్ చేస్తూ.. దాఖలైన పిటిషన్లపై విచారణ చేపట్టాల్సి ఉంది.

# 5 ఎకరాల వరకే రైతుబంధు..

# అది కూడా సీజన్ చివర్లో..




రైతుబంధు పథకానికి సంబంధించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కొత్త విధివిధానాలు తయారు చేసే పనిలో నిమగ్నమైంది. గత ప్రభుత్వం హయాం లో రైతుబంధు పేరుతో చాలా వరకు డబ్బులు వృథా అయ్యాయని.. ఈసారి అలా కాకుండా అర్హులైన రైతులకు మాత్రమే అందేలా చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు.. 5 ఎకరాల వరకే రైతుబంధు ఇవ్వాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టు తెలుస్తోంది. అది కూడా సీజన్ మొదట్లో కాకుండా చివర్లో ఇవ్వాలని ఆలోచిస్తున్నట్టు సమాచారం. సంచలన నిర్ణయాలతో పాలన సాగిస్తోన్న రేవంత్ రెడ్డి సర్కార్.. రైతు బంధు విషయంలోనూ కీలక నిర్ణయం తీసుకుంటున్నట్టు తెలుస్తోంది. గత ప్రభుత్వంలో చెట్లు పుట్టలు, రోడ్లు, గుట్టలకు, పెద్ద పెద్ద భూస్వాములకు రైతుబంధు డబ్బులు ఇచ్చారని తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. రైతు భరోసా కోసం కఠినమైన విధివిధానాలు రూపించే పనిలో నిమగ్నమైంది. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అర్హులైన నిరుపేదలకే పథకాలు అందాలన్న లక్ష్యంతో ముందుకెళ్తున్న రేవంత్ రెడ్డి సర్కార్.. రైతు బంధు పెట్టుబడి విషయంలోనూ అదే టార్గెట్ పెట్టుకుంది. ముందు నుంచి రైతుబంధును ఐదెకరాలకు పరిమితి విధించాలన్న ఆలోచనలో ఉన్న ప్రభుత్వం.. ఆ మేరకే విధివిధానాలు రూపొంది స్తున్నట్టు తెలుస్తోంది. రైతు భరోసాకు 5 ఎకరాల పరిమితి విధించనున్నట్టు వార్తలు ప్రచారమవు తున్న నేపథ్యంలో.. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వాటికి బలం చేకూరుస్తున్నాయి. దీంతో.. కేవలం 5 ఎకరాల స్థలం ఉన్నవారికే.. అది కూడా సాగు చేసే స్థలానికి మాత్రమే ఇవ్వాలని విధివిధానాలు తయారు చేస్తున్నట్టు సమాచారం. అది కూడా.. వ్యవసాయ పనులు మొదలయ్యే ముందు కాకుండా సీజన్ చివరలో పంట సాయం అందించే ఆలోచన చేస్తున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే ఐదు ఎకరాల వరకు రైతుబంధు నగదును అన్నదాతల అకౌంట్లలో ప్రభుత్వం.. దశలవారిగా ఇప్పటికే జమ చేసింది. కాగా.. ప్రస్తుతం ఎన్నికల కోడ్ నడుస్తుండగా.. ఎలక్షన్లు పూర్తయిన వెంటనే రైతుబంధుకు సంబంధించిన కొత్త విధివిధానాలను ప్రభుత్వం ప్రకటించనున్నట్టు తెలుస్తోంది.

# విద్యార్థులకు టీఎస్ఆర్టీసీ గుడ్‌న్యూస్..

విద్యార్థుల రద్దీకి అనుగుణంగా ఎలక్ట్రిక్ బస్సులు నడిపేందుకు కార్యచరణ రూపొందిస్తున్నారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా టీఎస్ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో బస్సుల్లో రద్దీ విపరీతంగా పెరిగింది. పెరిగిన రద్దీకి అనుగుణంగా కొత్త ఎలక్ట్రిక్ బస్సుల కొనుగోలుకు ఆర్టీసీ సిద్ధమైంది. మరో రెండు, మూడు నెలల్లో 550 ఎలక్ట్రిక్ బస్సులు సమకూర్చుకునేందుకు రెడీ అయింది. ఈ నేపథ్యంలో విద్యార్థులకు ఆర్టీసీ తీపికబురు చెప్పింది. విద్యార్థుల సౌకర్యార్థం ఉదయం, సాయంత్రం వేళల్లో కాలేజీలకు ఈ బస్సులను నడపాలని భావిస్తున్నారు. అందుకు కాలేజీల యాజమాన్యాలు సైతం సహకరించాలని ఆర్టీసీ కోరుతోంది. ఆయా ప్రాంతాల్లోని కళాశాలలు అన్నింటిని ఒకేసారి ప్రారంభించకుండా.. గంట నుంచి రెండు గంటల వ్యత్యాసంతో ప్రారంభిస్తే.. బస్సులు సర్దుబాటు చేయడానికి వీలుంటుందని ఆర్టీసీ చెబుతోంది. ఈ మేరకు ప్రతి కాలేజీకి లేఖలు రాయడంతో పాటు స్వయంగా ఆయా యాజమాన్యాలతో సంప్రదింపులు జరుపుతోంది. డివిజనల్ మేనేజర్లకు ఈ బాధ్యత అప్పజెప్పింది ఆర్టీసీ. అధికారులు బస్సుల్లో ప్రయాణించే విద్యార్థుల అంచనాల్లో ఇప్పటికే నిమగ్నమయ్యారు. రానున్న అకడమిక్ ఇయర్ ఆరంభం నాటికే సర్వేను పూర్తి చేసి, అందుకు అనుగుణంగా ఎలక్ట్రిక్ బస్సులు నడపాలని ఆర్టీసీ నిర్ణయించింది. అనేక కాలేజీల్లో వేలాది మంది విద్యార్థులు చదువుతున్నారు. సరైన ప్రయాణ సదుపాయాలు లేకపోవడంతో షేర్ ఆటోల్లో, బైక్‌లపై ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. బస్సుల్లో వేలాడుతూ ఫుట్ బోర్డు ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ సమస్య పరిష్కార చర్యలకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు కొత్త బస్సులు నడపేందుకు చర్యలు చేపట్టారు.

# జోరు మీదున్న నటి కియారా



ఇప్పుడు బాలీవుడ్ లో అగ్ర నటీమణుల్లో స్థానం సంపాదించడానికి ప్రయత్నం చేస్తున్న నటీమణుల్లో కియారా అద్వానీ ఒకరు. రామ్ చరణ్ పక్కన 'గేమ్ చెంజర్' సినిమాలో కథానాయికగా నటిస్తోంది. శంకర్ దర్శకుడు, దిల్ రాజు నిర్మాత. ఈ సినిమా ఒక్క తెలుగులోనే కాకుండా, మిగతా భాషల్లో కూడా విడుదలయ్యే అవకాశాలు వున్నాయి. ఈ సినిమాతో పాటు ఇంకో పెద్ద సినిమా 'వార్ 2' లో కూడా కియారా కథానాయిక. గతేడాది ఫిబ్రవరి 7 తనతో ప్రేమలో వున్న సహచర నటుడు సిద్దార్థ్ మల్హోత్రా ని వివాహం చేసుకుంది కియారా అద్వానీ. తెలుగులో 'భరత్ అనే నేను' సినిమాతో మహేష్ బాబు పక్కన ఆరంగేట్రం చేసింది. ఆ తరువాత 'వినయ విధేయ రామ' అనే ఇంకో తెలుగు సినిమాలో నటించింది, ఇందులో రామ్ చరణ్ కథానాయకుడు. కియారా కి 'భరత్ అనే నేను' పెద్ద బ్రేక్ ఇచ్చిన సినిమా. తెలుగు సినిమా విడుదల సమయంలోనే 'లస్ట్ స్టోరీస్' అనే ఒక వెబ్ సినిమాలో ఒక బోల్డ్ పాత్రలో నటించి, అందరి దృష్టి ఆకర్షించింది. తెలుగులో పెద్ద విజయం సాధించిన 'అర్జున్ రెడ్డి' సినిమాని హిందీలో తెలుగు దర్శకుడు సందీప్ వంగా 'కబీర్ సింగ్' పేరుతో అర్జున్ కపూర్ కథానాయకుడిగా రీమేక్ చేశారు. అందులో కియారా అద్వానీ కథానాయికగా నటించింది. హిందీలో కూడా ఇది పెద్ద విజయం సాధించింది. హిందీలో తన ప్రియుడు సిద్దార్థ్ మల్హోత్రా పక్కన నటించిన యుద్ధ నేపథ్యంలో వచ్చిన సినిమా 'షేర్ షా'. ఇది నేరుగా అమెజాన్ ప్రైమ్ వీడియో లో విడుదలైంది. ఈ సినిమా అటు విమర్శకుల ప్రశంశలు, ఇటు ప్రేక్షకుల మన్ననలు పొందింది. 2021లో వచ్చిన ఈ సినిమా తరువాత కియారా సినిమాలు అంతగా బాక్స్ ఆఫీస్ దగ్గర ప్రభావం చూపలేదని చెప్పాలి. కియారా ఇప్పుడు 'గేమ్ చేంజర్' సినిమాపై చాలా అసలు పెట్టుకున్నట్టు కనపడుతోంది. ఎందుకంటే ఇప్పుడు ఆమె చేతిలో ఈ ఒక్క తెలుగు సినిమానే వుంది. ఇది హిందీలో కూడా విడుదలవుతుంది అని అనుకుంటున్నారు. ఈ సినిమా విడుదల తరువాత ఆమె 'వార్ 2' షూటింగ్ లో పాల్గొంటారు.

# మంచు లక్ష్మి ఫాంటసీ మూవీ ఆదిపర్వం



మంచు లక్ష్మి ప్రధాన పాత్రలో నటించిన సోషియో ఫాంటసీ మల్టీ లింగ్యువల్ ఫిలిం ఆదిపర్వం చిత్రానికి సంజీవ్ మేగోటి దర్శకుడు. రావుల వెంకటేశ్వర్ రావు సమర్పణలో అన్వికా ఆర్ట్స్, ఎ.ఐ ఎంట్టంల్గ÷న్మెంట్స్ సంయుక్త నిర్మాణంలో ఐదు భాషల్లో ఈ సినిమా రూపుదిద్దుకుంది. ఈ చిత్రం 1974 నుంచి 1992 మధ్య జరిగే పీరియాడిక్ డ్రామాగా తెరకెక్కింది. సోమవారం ఐదు భాషల్లో ట్రైలర్ విడుదల చేశారు. తెలంగాణ ఎఫ్.డి.సి ఛైర్మన్ ఎన్. గిరిధర్ చేతుల మీదుగా ఆదిపర్వం తెలుగు ట్రైలర్ విడుదలైంది. జడ్చర్ల ఎమ్మెల్యే జె అనిరుధ్ రెడ్డి తమిళ ట్రైలర్, ప్రముఖ దర్శకులు నీలకంఠ కన్నడ ట్రైలర్, ప్రముఖ రియల్టర్ శిల్పా ప్రతాప్ రెడ్డి మలయాళ ట్రైలర్, చిత్ర సమర్పకులు రావుల వెంకటేశ్వర్ రావు హిందీ ట్రైలర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న తెలుగు ఫిల్మ్ ప్రొడ్యూసర్స్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్న కుమార్, బిల్డర్ క్రైపా ప్రతాప్ రెడ్డి, నటీనటులు ఢిల్లీ రాజేశ్వరి, సత్య ప్రకాష్, శివ కంఠమనేని, వెంకట్ కిరణ్, జెమినీ సురేష్, ఆదిత్య ఓం, శ్రీజిత ఘోష్, సీనియర్ జర్నలిస్టులు ప్రభు, ఆర్.డి.ఎస్ ప్రకాష్, సినిమాటోగ్రాఫర్ ఎస్.ఎస్. హరీష్, ఎగ్జిక్యూటివ్ నిర్మాత ఘంటా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. అతిధులంతా సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. లక్ష్మి మంచు మాట్లాడుతూ.. 'నాకు సంజీవ్ గారు కథ చెప్పినప్పుడు ఇంత పెద్ద సినిమా తక్కువ సమయంలో ఎలా చేస్తారని అనుకున్నా. పోస్టర్ చూస్తుంటే నేను ఇన్ని క్యారెక్టర్లు చేశానా అనిపిస్తుంది. నవ రసాలు, అన్ని రకాల ఎమోషన్స్ ఈ సినిమాలో ఉన్నాయి. అందరికీ ఈ సినిమా నచ్చుతుంది. మా దర్శకుడు చాలా స్వీట్ పర్సన్. మా నిర్మాతలు కోరుకున్న దాని కంటే ఎక్కువ విజయం సాధించాలని కోరుతున్నా' అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఓ అభిమాని మంచు లక్ష్మికి పాదాభివందనం చేయగా పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన అభిమానులు మంచు లక్ష్మిని గజమాలతో సత్కరించారు. దర్శకుడు సంజీవ్ మేగోటి మాట్లాడుతూ.. 'మంచు లక్ష్మి గారి ద్వారా మీరు స్టార్ డైరెక్టర్ కాబోతున్నారని 'ఆదిపర్వం' పోస్టర్ చూసి చాలామంది చెప్పారని అది నాకు చాలా సంతోషంగా అనిపించిందని, అవార్డు వచ్చినంత ఆనందం వేసిందన్నారు. ఈ మూవీలో మంచు లక్ష్మి గారి విశ్వరూపం చూస్తామని.. ఆదిత్య ఓం గారిని కొత్త పాత్రలో చూస్తారన్నారు. ఎస్తర్ కీలక పాత్ర చేశారన్నారు. శ్రీజిత ఘోష్ వద్దని 99 మంది చెబితే నేను ఒక్కడినే ఆ అమ్మాయి అయితే బాగుంటుందని చెప్పా అని ఆమె 1000 శాతం న్యాయం చేసిందన్నారు. క్షేత్ర పాలకుడిగా శివ కంఠమనేని, లక్ష్మి మంచుభర్త పాత్రలో జెమిని సురేష్, థియేటర్ ఆర్టిస్ట్ వెంకట్ కిరణ్ చక్కని నటన కనబరిచారన్నారు. మొత్తంగా ఈ సినిమాలో సుమారు 400 మంది నటించారన్నారు. ఈ సినిమాకు బలం, బలగం మంచు లక్ష్మి (ఓజీనిఇ:ఠబీ ఒజీబఠపతి) గారని, దాదాపు 7 గెటప్స్ వేసిందన్నారు. దాదాపు 50 అడుగుల ఎత్తుల్లో ÷ట్స్ చేశారని, ఆవిడ లేకపోతే ఈ మూవీ లేదని. ఈ మూవీకి ఇంత ప్రాముఖ్యం వచ్చేది కాదని ఇది ఆరంభం మాత్రమే' అని అన్నారు.

# శివానీ నాగరం మంచి సింగర్



అంబాజీపేట మ్యారేజి బ్యాండు' చిత్రంతో హీరోయిన్గా పరిచయం అయిన తెలుగమ్మాయి శివాని నాగరం. సుహాస్ హీరోగా దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో ధీరజ్ మొగిలినేని నిర్మించిన ఈ చిత్రం ఫిబ్రవరి 2న రిలీజై మంచి విజయం దక్కించుకుంది. ఈ సినిమాలో హీరోయిన్ గా నటించిన శివాని తనదైన నటనతో..క్యూట్ ఎక్స్ప్రెషన్స్ తో ఆడియన్స్ మనసులని దోచేసింది. అయితే ఈ అమ్మడికి నటనలోనే కాదు..సింగర్ గా కూడా తన సినిమా ప్రస్థానాన్ని కొనసాగిస్తోంది. లేటెస్ట్గా శివాని నాగరం సింగర్ గా అవతారమెత్తింది. ఆరంభం అనే సినిమాలో శివాని ఓ బ్యూటిఫుల్ లవ్ సాంగ్ పాడింది. 'అమాయకంగా హడావుడేమి లేక..తార చేరుకుందా ఇలా. అయోమయంగా తలాడించులాగ, నేల మారుతుందే ఎలా..కాలానికే కొత్త రంగు పూసే, మాయతార సొంతమేగా, హాయి సంతకాలు చేసేనా..' అంటూ మంచి లవ్ ఫీల్ తో ఓ మంచి కంపోజిషన్ తో సాగుతుందీ ఈ పాట. నిజానికి ఈ పాటకు మాత్రం శివాని నాగరం వాయిస్ స్పెషల్ అట్రాక్షన్ గా నిలిచిందిని చెప్పొచ్చు. రీసెంట్?గా రిలీజ్ చేసిన ఈ పాట చాలా వినసొంపుగా ఉండటంతో పాటు లిరికల్ వీడియోలో శివాని నాగారం ఇచ్చిన పెర్ఫార్మన్స్ క్యూట్ గా తనవైపు తిప్పుకునేలా ఉంది. ఇక టాలీవుడ్ లో హీరోయిన్స్ గా రాణిస్తూనే..సింగర్స్ గా మారిన వాళ్ళు చాలానే ఉన్నారు. అందులో నిత్యామీనన్, శ్రుతి హాసన్, ఎన్టీఆర్, తమిళ హీరో శింబు, సిద్దార్థ్ సహా ఎంతోమంది అదిరిపోయే పాటలు పాడారు.

# సిద్ధు డైలాగ్స్ టాలీవుడ్ మూవీ లవర్స్ మదిలో అలా నిలిచిపోయాయని చెప్పవచ్చు.



టిల్లు స్క్వేర్.. చేతులు మారిందా?డీజే టిల్లుతో స్టార్ బాయ్ గా మారిన సిద్ధూ జొన్నలగడ్డ.. మరికొద్ది రోజుల్లో ఆ సినిమా సీక్వెల్ తో రాబోతున్న విషయం తెలిసిందే. మల్లు బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రం.. వేసవి కానుకగా మార్చి 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. అయితే ఫస్ట్ పార్ట్ లోని టిల్లు ఫన్ ను ఇప్పటికీ ఎవరూ మర్చిపోలేరు. సిద్ధు డైలాగ్స్ టాలీవుడ్ మూవీ లవర్స్ మదిలో అలా నిలిచిపోయాయని చెప్పవచ్చు.

అయితే డీజే టిల్లు సూపర్ హిట్ అవ్వడం, టిల్లు స్క్వేర్ నుంచి ఇప్పటికే విడుదలైన ప్రమోషనల్ కంటెంట్ బాగా ఆకట్టుకోవడంతో ప్రేక్షకులు మంచి అంచనాలు పెట్టుకున్నారు. సినిమా కోసం ఈగర్లీ వెయిట్ చేస్తున్నారు. కొద్ది రోజుల క్రితమే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ మూవీ పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ శరవేగంగా జరుగుతున్నాయి.ఇదంతా పక్కన పెడితే.. డీజే టిల్లుకు స్టార్ మ్యూజిక్ డైరెక్టర్ తమన్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందించారు. ఇక సీక్వెల్ కు కూడా ఆయనే అందిస్తారని అంతా భావించారు. నిజానికి ఆ బాధ్యతలను తమన్ కు మేకర్స్ ఇప్పటికే అప్పగించారు. కానీ తమన్ తన బిజీ షెడ్యూల్ వల్ల ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకున్నారు. ఈ విషయాన్ని నిర్మాత నాగవంశీ ఇటీవల తెలిపారు.తమన్ స్థానంలో భీమ్స్ సిసిరోలియోను తీసుకున్నట్లు చెప్పారు. అనుకున్న డేట్ కు సినిమా రిలీజ్ చేయాలనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. తమన్ తప్పుకోవడం వెనుక కారణం చెప్పి పుకార్లు కూడా చెక్ పెట్టారు. ప్రస్తుతం బ్యాక్ గ్రౌండ్ వర్క్స్ లో భీమ్స్ బిజీగా ఉన్నారు. బలగం, మ్యాడ్ చిత్రాలకు అందించిన బ్యాక్ గ్రౌండ్ స్కోర్ తో మంచి పేరు సంపాదించుకున్నారు భీమ్స్.ప్రస్తుతం భీమ్స్.. టాలీవుడ్ ఫుల్ బిజీగా ఉన్నారు. ఇటీవల ఆయన మ్యూజిక్ అందించిన రజాకార్ మూవీ విడుదలైంది. అందులో సాంగ్స్ తోపాటు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కు మంచి రెస్పాన్స్ వస్తోంది. అయితే ప్రస్తుతం భీమ్స్ టిల్లు స్క్వేర్ రీ రికార్డింగ్ చేస్తుండగా.. రామ్ మిరియాల, అచ్చు రాజమణి మ్యూజిక్ అందిస్తున్నారు.